
# ఆయనకు ఎనభై - ఆయన కథకు అరవై

జనవరి మూడవ తేదీ శనివారం సాయంత్రం చలిగాలులు ఇంకా వీస్తూనే ఉన్నాయి. హైదరాబాద్ మహానగరంలో... ఆరోజు ప్రముఖ రచయిత వి. రాజారామమోహనరావు గారి ఎనభయ్యవ పుట్టినరోజు. అందుకోసం తన మిత్రులను, సన్నిహితులను పిలిచి ఆత్మీయ సమావేశాన్ని కుటుంబ సభ్యులు ఏర్పాటు చేశారు.. అందుకోసం మేము ఉబెర్ క్యాబ్‌లో బయల్దేరాం. శనివారం ఐటీ ఆఫీస్‌లకు సెలవే అయినా ట్రాఫిక్ సెలవు తీసుకోలేదు. మెల్లగా, బద్ధకంగా కదులుతోంది. మా అసహనాన్ని లెక్క చేయకుండా, వాహన చోదకుడు తన దారిన తాను సాగుతూ నింపాదిగా మమ్మల్ని రవీంద్ర భారతి చేర్చాడు. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో కార్యదర్శి డా. బాలాచారి, ప్రొఫెసర్ పార్థసారథి మాకోసం ఎదురుచూస్తూ సిద్ధంగా ఉన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ సరికొత్త కేలండర్ మంచి సంచీలో ఉంచి దానితోపాటు **పునాస** పత్రిక సంచికను మాకు కానుకగా ఇచ్చారు. రవీంద్ర భారతి మొదటి అంతస్తులోని సమావేశమందిరంలో జరగాల్సిన సభ, రెండవ అంతస్తులోని పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్‌కు మార్చారు. కారణం సమావేశమందిరంలోని సభ ఎడతెరిపి లేకుండా సాగుతుండటం.. ఒకందుకు అదీ మంచిదే అనిపించింది. ప్రివ్యూ థియేటర్‌లో సౌండ్ సిస్టం, సీటింగ్ సిస్టం రెండూ బావున్నాయి. సాయంత్రం ఆరున్నర అవుతుందేమో.. పొగమంచు ఎప్పుడో కమ్ముకున్నా అందరి మొహాల్లోని ఆనందం ఆ తెరలను తరిమేశాయి. ఒక మనిషి తన ఎనభై ఏళ్ళ జీవితంలో అరవై ఏళ్ళ పాటు రచనా వ్యాసంగంలో నిమగ్నమై ఉండటం మామూలు విషయం కాదు. నిజానికి ఆ అవకాశం అందరికీ దొరికేది కాదు. ఆ అవకాశం దక్కినవాళ్ళు అదృష్టవంతులనుకోవాలి. ప్రముఖ రచయిత వి. రాజారామమోహనరావు అటువంటి అదృష్టవంతులు. 1966లో తొలిసారి కథ రాసి, ఈ 2026లోను అంతే ఉత్సాహంగా కథను ఉత్సవం చేస్తున్న ఆయన కథకు అరవై ఏళ్ళు... ఒక్కమాటలో చెప్పాలంటే కథా రచనలో నిన్న, నేటి, రేపటి తరాలకు వారధిగా నిలుస్తున్న అతికొద్దిమంది రచయితల్లో ఆయనది మొదటిస్థానం. రవీంద్రభారతి రెండవ అంతస్తులోని పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్ చక్కటి సభా వేదిక కూడా అని ఆరోజే తెలిసింది. హాలు రచయితలతోను, మిత్రులతోను నిండిపోయింది. ఒకవిధంగా కొత్త సంవత్సరం ఒక చక్కటి సాహిత్య ఉత్సవంతో మొదలైందనిపించింది. పాతతరం నుంచి నేటితరం వరకు ఎంతోమంది కబుర్లు, కరచాలనాలు, పలకరింపులు, కేరింతలు, తుళ్ళింతలను కళ్ళింత చేసుకుని చూసే అవకాశం లభించింది. రాజారామమోహనావు ఆప్తుడు కిషోర్ దాస్ సభా నిర్వహణ తన భుజాన వేసుకుని తనదైన శైలిలో నిర్వహించారు. రాజారామమోహనరావు గారి మరోకథా సంపుటి **వేదోదు**ను, అలాగే రాజారామమోహనరావు గారిపై మిత్రులు, ఆత్మీయులు పంచుకున్న జ్ఞాపకాల కదంబంగా మరో పుస్తకాన్ని ఆవిష్కరించారు. **కథాభారతి, తెలంగాణ సాహిత్య అకాడమీ** కలిసి ఈ వేడుకను నిర్వహించాయి. తెలంగాణ సాహిత్య అకాడమీ మొదటి, మూడవ శనివారాలను సాహిత్య శనివారంగా ఇటీవలి కాలంలో జరుపుతోంది. అదొక శుభపరిణామం. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. బాలాచారి ఈ కార్యక్రమాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ పక్షాన జరపటం తమకెంతో ఆనందాన్నిచ్చిందన్నారు. రాజారామమోహనరావు గారి సర్కిల్ చాలా పెద్దదని ఆరోజు అర్థమయింది. సభల్లో అరుదుగా కనిపించే దర్శకుడు బి. నరసింగరావు, రచయిత యండమూరి వీరేంద్రనాథ్ ఇరువురు సభకు హాజరవటం, ఆప్యాయంగా రాజా అంటూ తమ జ్ఞాపకాలను గుర్తుచేసుకోవటం దానికి తార్కాణంగా కనిపిస్తుంది. ముందుగా మాట్లాడిన యండమూరి వీరేంద్రనాథ్ మాటలు సూటిగా తాకాయి... సభల్లోని డొల్లతనం బయటపెట్టాయి. చాలా సభల్లో ఈ రచయిత అంటూ పేరు వెతుక్కుంటూ కథ కంటతడి పెట్టించిందంటూ



ప్రొఫెసర్ పార్థసారథి, గుమ్మళ్ల శ్రీధర్, రాజా

ఆర్టిఫీషియల్‌గా మొదలెడతారు అంటూ సాగిన ఆయన ప్రసంగంలో ఒక్కమాట అక్షరసత్యమనే చెప్పాలి. మేం కమర్షియల్ రైటర్స్‌గా ఎదిగాం కానీ, రాజా మాత్రం తన కథలను నిజాయితీతో చెప్పాడు. అదంత ఈజీ కాదు. సభల్లో ఉండే కృత్రిమత్వం వలన సభలకు దూరంగా ఉండే నేను, ఈ సభకు కారణం రాజారామమోహనరావు అవటం వలన కాదనలేకపోయాను. ఇటువంటి అరుదైన వ్యక్తిని గౌరవించుకోవలసిన బాధ్యత సాహిత్య అకాడమీది అన్న ఆయనమాట అందరి తరఫున చెప్పినట్లనిపించింది. దర్శకుడు బి. నరసింగరావు నారాయణగూడ రోజుల్ని గుర్తు చేసుకున్నారు. తన **మాభూమి** చిత్రంలో రాజారామమోహనరావు తల్లిగారు ఆవిడకు ఆరోగ్యం సరిగ్గా లేకపోయినా నటించారని అదేవిధంగా రాజా కూడా ఒక ఎమర్జెన్సీ సందర్భంలో నటించారని గుర్తుచేసుకున్నారు. రాజారామమోహనావు చనిపోయినట్లు నటించాల్సి ఉందని, చాలామంది వెనకాడతారు అటువంటి దృశ్యంలో నటించడానికి.. కానీ రాజా ఏమాత్రం సంకోచం లేకుండా నటించారని, అదే ఆయన సుదీర్ఘ ఇన్నింగ్స్‌కు కారణమయిందని నవ్వుల మధ్య చెప్పారు. దూరదర్శన్ ప్రయోక్త డా. వోలేటి పార్వతీశం మాట్లాడుతూ కేవలం కథలు, నవలలు మాత్రమే కాకుండా **మిసిమి** ప్రచురించిన **నవలాహృదయం** శీర్షికన ఆయన గొప్ప గొప్ప నవలలు అద్భుతంగా పరిచయం చేశారని పేర్కొంటూ, ఒక రచనపై ఎవరు చేయని పరిశీలనలు రాజారామమోహనావు చేస్తారని, ఆవిధంగా ఈ పుస్తకం సాహిత్య అకాడమీ పురస్కారం పొందేందుకు అన్ని అర్హతలు కలిగుందని గుర్తుచేశారు. ఆనాటి సభలో ఇద్దరు వ్యక్తులు సుదీర్ఘ ప్రసంగాలు చేశారు. ఒకరు ప్రొఫెసర్ పార్ధసారథి మరొకరు కథా భారతి తరఫున ఆనాటి రెండు పుస్తకాలు పబ్లిష్ చేసిన రాజారామమోహనావు గారి అభిమాని గుమ్మళ్ళ శ్రీధర్. ప్రొఫెసర్ పార్థసారథి గారు మాట్లాడుతూ 1976లో చదివిన ఆయన **అనుభవం** కథ చాలా నేర్పిందని, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ కోసం జనరల్ స్టడీస్ పేపర్ రూపొందించినప్పుడు ఆయన కథలోని థీంను వ్యాసాంశంగా ఇచ్చానని, ఆయన కథలెప్పుడు తనకు తెలియని మనశ్శాంతినిస్తాయని చెప్పారు. **మిసిమి**లోని వ్యాసాలు ఆయన్ని తనకు దగ్గర చేశాయన్నారు. నిజానికి ఆయనతో ప్రత్యక్ష పరిచయం 2024లో జరిగిన పుస్తకావిష్కరణ సభలో జరిగిందని పేర్కొన్నారు. అప్పుడు రాజారామమోహనావు గారితో ఆయన కథలపై జరిగిన ఆత్మీయ ఆంతరంగిక సంభాషణ, ఈరోజు ఇలా తనను వేదికెక్కించిందని ఆయన ఉద్వేగంగా చెప్పటం ఆశ్చర్యమనిపించింది. కథాభారతి ద్వారా గుమ్మళ్ళ శ్రీధర్ ఈ రెండు పుస్తకాలు ప్రచురించారు. ఈ సభను కూడా ఆయనే నిర్వహించటానికి పూనుకోవడం విశేషం. ఆయన ఈ సభ కోసం ఎక్కడో జపాన్‌లో ఉంటూ భారతదేశ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్‌ని పట్టాలెక్కించడానికి కష్టపడుతూనే రాజారామమోహనరావు గారి రెండు పుస్తకాలు ప్రూఫ్ రీడింగ్ చేసి, పబ్లిష్ చేసే బాధ్యత తీసుకున్నాను అన్నారు శ్రీధర్. ఆయన మాటల్లో తన అభిమాన రచయితపట్ల భక్తి, బాధ్యత అన్నీ కనిపించాయి ఆ రోజున. రాజారామమోహనరావు గారి తల్లిగారు ధన్యులంటూ పుట్టినరోజు జేజేలు అంటూ పాట వినిపించి అందరినీ మరో లోకంలోకి తోడ్కొనిపోయారు. వేదిక ఏవిధంగా మారిందో... అలాగే సభ కూడా కొంత ఫార్మల్‌గా, కొంత ఇన్ఫార్మల్‌గా సాగటం విశేషం. బహుశః దానికి కారణం కిషోర్ దాస్ గారి చాతుర్యమేమో.. హలో.. ఎలా ఉన్నారు, చాలాకాలమైంది మిమ్మల్ని చూసి అనేవారు, అరే నువ్వా.. అనుకునేవారు ఎంతమందో ఆ రోజున... ప్రధాన వక్తల ప్రసంగాల అనంతరం సభికుల్లోంచి రాజరామమోహనావు గారి అభిమానులను ఒక్కొక్కరిని వేదికపైకి పిలిచి రెండు ముక్కలు మాట్లాడమంటూ ఆహ్వానించారు కిషోర్ దాస్.

ప్రముఖ రచయితలు పాలకోడేటి సత్యనారాయణ, సింహప్రసాద్, వాణిశ్రీ, వేమూరి సత్యనారాయణ, తాడిప్రకాష్, పులగం చిననారాయణ, రవిపాడి, వడ్డి ఓం ప్రకాష్, ఖదీర్ బాబు, వసీరా, రామశర్మ వంటి అనేకులతో పాటు ప్రసాద్ సూరి, ఈశ్వర్‌చంద్ర వంటి నవతరం రచయితలు కూడా పాల్గొని సభకు వన్నె తెచ్చారు. ఆడిటోరియం కళకళలాడింది. పాతికేళ్ళుగా రైటర్స్ మీట్ నిర్వహిస్తున్న ఖదీర్‌బాబు ఈ సందర్భంగా, తమ రైటర్స్ మీట్ పాతికేళ్ల పండుగ సమావేశం ఫిబ్రవరిలో జరుగుతోందని, ఆరోజున వారికి **కథా దీపధారి** పురస్కారం ఇవ్వబోతున్నామని కరతాళధ్వనుల మధ్య చెప్పారు. కథకు మరో పురస్కారం మధునాపంతుల వారిది, ఫిబ్రవరిలో పల్లెపాలెంలో అందుకోబోతున్నారు రాజారామమోహనరావు గారు.

సభానంతరం కాస్త కాఫీ తాగి, టిఫిన్ చేద్దామని కామధేనులాంటి కామత్ హొటల్‌కు వస్తే అక్కడా చలిని ఈదుకుంటూ జనం ఉఫ్‌మని ఊదుకుంటూ కాఫీని, వేడి వేడి టిఫిన్‌లో ఆరగింపులోను ఉన్నారు. ఆత్మారాముడిని బుజ్జగిస్తూ ఆకలిని సముదాయించి ఆనక మళ్ళీ క్యాబ్ ఎక్కే తప్పు చేయకుండా బుద్ధిగా మెట్రో ఎక్కి గూటికి చేరాం.